నేటి దినపత్రిక సూర్య
www.suryaa.com
18వ వసంతంలోకి..
www.suryaa.com

EVENING EDITION

నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com

4PM
www.suryaa.com
సోమవారం
04 నవంబర్ 2024
పేజీలు: 02



## ఫ్లెక్సీలు కడుతుండగా
# కరెంట్ షాక్..
### నలుగురు యువకులు దుర్మరణం

ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పుగోదావరి జిల్లా ఉండ్రాజవరం మండలంలో విషాదం చోటుచేసుకుంది. మండలంలోని తాడిపర్రులో విద్యుదాఘాతంతో నలుగురు యువకులు మృతిచెందారు. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. తాడిపర్రులో ఏర్పాటు చేసిన పాపన్న గౌడ్ విగ్రహాన్ని సినీ నటుడు సుమన్ ఆవిష్కరించనున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం ఉదయం గ్రామానికి చెందిన బొల్లా వీర్రాజు, పామర్తి నాగేంద్ర, మారిశెట్టి మణికంఠ, కాసగాని కృష్ణ ఫ్లెక్సీలు కడుతుండగా కరెంట్ కొట్టింది. దీంతో వారు అక్కడికక్కడే మరణించారు. మరో యువకుడు కోమటి అనంరావు తీవ్రంగా పడ్డాడు. దీంతో అతడిని చికిత్స నిమిత్తం తణుకు ఏరియా దవాఖానకు తరలించారు. మృతుల కుటుంబాలకు మంత్రి గొట్టిపాటి రవికుమార్ సానుభూతి ప్రకటించారు. వారిని అన్నివిధాలా ఆదుకుంటామని తెలిపారు. కాగా, ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

## మోసగాళ్లకు కౌంట్ డౌన్ స్టార్ట్..
# ఇంకా 35 రోజులే మిగిలింది..!
### బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



ఎక్స్ వేదికగా కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మరోసారి విమర్శలు గుప్పించారు. వంద రోజుల్లో ప్రతి గ్యారెంటీ నెరువేరుతుందన్న మోసగాళ్లకు కౌంట్ డౌన్ స్టార్టయిందంటూ ఎక్స్‌లో పోస్టు చేశారు. మూడు వందల ముప్పై రోజులు ముగిసిందని, ఏడాది నిండడానికి ఇంకా 35 రోజులే మిగిలిందని రాసుకొచ్చారు. చెప్పిన హామీలన్నీ బూడిదలో పన్నీరయ్యే, చెప్పని మూసీలో.. లక్షల కోట్ల మూటలాయే అంటూ ఎద్దేవా చేశారు. ఏడాది కాలమంతా అటెన్షన్ డైవర్షన్‌తో సర్కార్ పబ్బం గడిపిందని ఆరోపించిన ఆయన, ప్రజాపాలనలో ధర్నాలు, రాస్తారోకోలు తప్ప ఏముంది గర్వకారణమంటూ ప్రశ్నించారు.

- ఏడాదికి 35 రోజులు మాత్రమే మిగిలింది-2 లక్షల జాబ్ లు ఎక్కడ అంటున్నారు నిరుద్యోగులు
- ఏడాదికి 35 రోజులే మిగిలింది - ఎకరాకు ₹15000 రైతు భరోసా ఏమైంది అంటున్నారు రైతన్నలు
- ఏడాదికి 35 రోజులే మిగిలింది - పెంచిన ₹4,000 పెన్షన్ ఎక్కడంటున్నారు అవ్వ తాతలు
- ఏడాదికి 35 రోజులే మిగిలింది-నెల నెల ఇస్తామన్న ₹2500 ఎక్కడబోయాయి అంటున్నారు అడబిడ్డలు
- ఏడాదికి 35 రోజులే మిగిలింది-పెంచి ఇస్తామన్న ₹6,000 పెన్షన్ ఎక్కడని నిలదీస్తున్నారు దివ్యంగా అన్నలు,అక్కలు
- ఏడాదికి 35 రోజులే మిగిలింది-ఉద్యోగులు మా పీఆర్సీ ఎక్కడ, మా డీఏలు ఎక్కడని సమ్మెలకు సై అంటున్నారు
- ఏడాదికి 35 రోజులే మిగిలింది - కౌలు రైతులు 15000 ఎక్కడ, రైతు కూలీలు 12000 ఎక్కడ అంటున్నారు
- ఏడాదికి 35 రోజులే మిగిలింది - తులం బంగారం ఎక్కడా అంటున్నారు మా బంగారు తల్లులు

చెప్పిన హామీలన్నీ బూడిదలో పన్నీరయ్యే - చెప్పని మూసీలో లక్షల కోట్ల మూటలాయే. ఏడాది కాలమంతా అటెన్షన్ డైవర్షన్ తో పబ్బం గడిపిన మూసి సర్కార్. ఏముంది ఈ ప్రజా పాలనలో గర్వకారణం ధర్నాలు,రాస్తారోకోలు తప్ప ? జవాబు చెప్తావా ఢిల్లీ బాబు రాహుల్‌గాంధీ?

రాష్ట్ర వ్యాప్తంగా మాజీ సర్పంచులను అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం

పెండింగ్ బిల్లులు ఇవ్వాలని ఏడాది కాలంగా అడిగినా ఇవ్వకపోవడం సిగ్గుచేటని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. రాష్ట్ర వ్యాప్తంగా మాజీ సర్పంచులను అరెస్ట్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. శాంతియుత నిరసనకు పిలుపునిచ్చిన సర్పంచులను ఎందుకు అరెస్ట్ చేస్తున్నారని నిలదీశారు. సర్పంచుల కుటుంబాలు రోడ్డున పడే దాకా ప్రభుత్వం స్పందించదా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో నిత్యం అరెస్టుల పర్వమే కొనసాగుతున్నదని, పోలీసులతో సమస్యలను అణగదొక్కాలని ప్రభుత్వం చూస్తున్నదని మండిపడ్డారు. పల్లె ప్రగతి పేరుతో తాము చేపట్టిన కార్యక్రమానికి తూట్లు పొడిచి నిధులు విడుదల చేయకుండా ఆపుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అరెస్ట్ చేసిన సర్పంచ్‌లను వెంటనే విడుదల చేయాలని ఎక్స్ వేదికగా డిమాండ్ చేశారు.

## ఊరికి సేవ చేసిన సర్పంచులను అరెస్టులు చేయడమేనా ప్రజాపాలన
### సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు



రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న మాజీ సర్పంచ్‌ల అరెస్టులను, అక్రమ నిర్బంధాలను సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు తీవ్రంగా ఖండించారు. పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని కోరుతూ పోరుబాటకు పిలుపునిచ్చిన మాజీ సర్పంచ్‌లను రాష్ట్రవ్యాప్తంగా ఎక్కడికక్కడ అరెస్టులు చేయడమేంటని ప్రశ్నించారు. సీఎం రేవంత్ రెడ్డిని కలిసి వినతిపత్రం ఇవ్వాలని హైదరాబాద్‌కు వస్తే వారిని అడ్డుకోవడం, అక్రమంగా నిర్బంధించడం అప్రజాస్వామికమన్నారు. అప్పులు తెచ్చి, ఆస్తులు అమ్మి, భార్యా పిల్లల మీద ఉన్న బంగారం కుదువ పెట్టి గ్రామ అభివృద్ధి కోసం చేసిన డబ్బులు ఇవ్వాలంటే ప్రభుత్వం అరెస్టులు చేస్తున్నదని మండిపడ్డారు. ప్రజాపాలన అంటే ఊరికి సేవ చేసిన సర్పంచులను అరెస్టులు చేయడమేనా అని నిలదీశారు. బడా కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లిస్తూ, చిన్న పనులు చేసిన మాజీ సర్పంచులకు మాత్రం బిల్లులు చెల్లించకపోవడంలో ఆంతర్యం ఏమిటన్నారు. అక్రమంగా నిర్బంధించిన, అరెస్టులు చేసిన మాజీ సర్పంచులను వెంటనే విడుదల చేయాలని, పెండింగ్ బిల్లులను తక్షణం చెల్లించాలని బీఆర్ఎస్ పార్టీ పక్షాన ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామన్నారు.

## పెండింగ్ బిల్లుల కోసం మాజీ సర్పంచుల పోరుబాట..
# ఎక్కడికక్కడ అరెస్టులు

రాష్ట్ర ప్రభుత్వంపై మాజీ సర్పంచులు సమరశంఖం పూరించారు. పెండింగ్ బిల్లుల కోసం పోరుబాటపట్టారు. చల్ హైదరాబాద్‌కు పిలుపునిచ్చారు. తమ సమస్యలపై సీఎం రేవంత్ రెడ్డి ఇంటికి వెళ్లి వినతి పత్రం ఇవ్వనున్నామని ప్రకటించారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా మాజీ సర్పంచులను పోలీసులు ఎక్కడికక్కడ అరెస్టులు చేస్తున్నారు. హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని ఓ హోటల్‌లో సమావేశమైన మాజీ సర్పంచులను అదుపులోకి తీసుకున్నారు. దీంతో రోడ్డుపై బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్దపెట్టున నినాదాలు చేశారు. సర్పంచుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుర్వి యాదయ్య గౌడ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండి మధుసూదన్ రెడ్డి, రేపాక నాగయ్య, గుర్రాలదండి ఆంజనేయులు, దుంప ఆంజనేయులుతోపాటు పలువురు మాజీ సర్పంచులను అరెస్టు చేసి వివిధ పోలీస్ స్టేషన్లకు తరలించారు.కాగా, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 10 నెలలైనా, తమ పదవీకాలం ముగిసి 9 నెలలు కావస్తున్నా పెండింగ్ బిల్లుల విడుదల చేయడం లేదని మాజీ స్వరంచులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## మత్స్య ఉత్పత్తుల్లో
# ఏపీ నంబర్-1

చెరువుల్లో చేపలు, రొయ్యల ఉత్పత్తిలో రాష్ట్రం దేశంలోనే టాప్‌లో నిలిచినట్లు కేంద్ర గణాంక శాఖ నివేదికలో వెల్లడైంది. జాతీయ స్థాయిలో ఏపీ వాటా 2011-12లో 17.7 శాతం ఉండగా, 2022-23 నాటికి 40.9 శాతానికి పెరిగింది. ఆ తర్వాతి స్థానాల్లో బెంగాల్(14.4%), ఒడిశా(4.9%), బిహార్(4.5%), అస్సాం(4.1%) ఉన్నాయి. ఇక పశువుల ఉత్పత్తిలో ఏపీ ఫోర్త్, ఉద్యాన ఉత్పత్తుల్లో ఐదో స్థానంలో నిలిచింది.

## విశాఖ స్టీల్‌కు
# రూ.1650 కోట్ల సాయం

ఆర్థిక, నిర్వహణ సవాళ్లతో ఇబ్బందిపడుతున్న విశాఖ ఉక్కు పరిశ్రమకు కేంద్రం రూ.1650 కోట్ల సాయం అందించింది. సంస్థ కార్యకలాపాలు యథావిధిగా కొనసాగేలా ఈ చర్యలు చేపట్టినట్లు వివరించింది. దీనిలో భాగంగా సెప్టెంబర్ 19న ఈక్విటీ కింద రూ.500 కోట్లు, వర్కింగ్ క్యాపిటల్ లోన్ కింద రూ.1150 కోట్లు అందించినట్లు వివరించింది. సంస్థ సుస్థిరంగా నిలదొక్కుకునేలా SBI ఆధ్వర్యంలో ఒక నివేదికను సిద్ధం చేస్తున్నట్లు తెలిపింది.



## హీరోయిన్‌ను కూడా
# హీరోలే డిసైడ్ చేస్తారు

నిర్మొహమాటంగా మాట్లాడి వార్తల్లో నిలుస్తుంటుంది అందాలభామ తాప్సీ పన్ను. రీసెంట్‌గా ఆమె ఓ ఇంటర్వ్యూలో చేసిన వ్యాఖ్యలు బీటౌన్‌లో చర్చనీయాంశమయ్యాయి. 'డంకీ, జూడ్వా2 చిత్రాలకు పెద్దమొత్తంలో పారితోషికాలు అందుకున్నానని ఈ మధ్య కొందరు నాపై కథనాలు రాసేశారు. వారికి తెలిని విషయం ఏంటంటే, కథానాయికలు అడిగినంత పారితోషికాలు ఇచ్చేలా పరిశ్రమ లేదు. ఇండస్ట్రీలో హీరోయిన్స్‌ని ఒక్కొక్కరూ ఒక్కోలా చూస్తారు.పెద్ద హీరోలున్న సినిమాల్లో హీరోయిన్లకు విలువే ఉండదు. కొందరు హీరోలు ట్రెండింగ్‌లో ఉన్న హీరోయిన్లను ఎంచుకుంటారు.

## గాజాపై ఇజ్రాయెల్ దాడులు..
# 23 మంది మృతి

గాజాలో ఉగ్రవాద సంస్థ హమాస్ తిరిగి పుంజుకోకుండా ఇజ్రాయెల్ దళాలు దాడిని తీవ్రం చేశాయి. అదివారం ఉత్తర గాజా సహా పలు ప్రాంతాలపై జరిపిన దాడుల్లో 23 మంది మృతి చెందారు. గత 48 గంటల్లో గాజాపై ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో 50 మంది చిన్నారులు మృతి చెందడంపై యూనిసెఫ్ ఖండించింది. మరోవైపు లెబనాన్‌లో హెజ్బొల్లాకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఇజ్రాయెల్ దాడుల్లో టాప్ కమాండర్ జాఫర్ ఖాదర్ ఫార్ హతమయ్యారు.


## రాష్ట్రంలో పెరిగిన భూగర్భ జలమట్టం

ఈసారి కురిసిన భారీ వర్షాల కారణంగా రాష్ట్రంలో భూగర్భ జలాలు పెరిగాయి. మేలో భూగర్భ జలమట్టం సగటున 10.36 మీటర్లు ఉండగా, అక్టోబర్‌లో అది 5.38 మీటర్లకు చేరిం ది. వికారాబాద్ జిల్లాలో అత్యధికంగా 8.69 మీటర్లు, ఆదిలాబాద్ 7.66 మీ. భూపాలపల్లిలో 7.35 మీ. మహబూబ్‌నగర్‌లో 6.94 మీ. మేర జలమట్టం పెరిగింది. యాదాద్రి-భువనగిరి జిల్లాలో అత్యల్పంగా 2.64 మీటర్ల మట్టం పెరిగింది.

## లోయలో పడిన బస్సు.. ఏడుగురు మృతి



ఉత్తరాఖండ్ లో సోమవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో 15 మంది మరణించారు. పలువురు గాయపడ్డారు. ఈ ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో 50 మంది ప్రయాణీకులున్నారు. అల్మోరా జిల్లాలో ప్రమాదవశాత్తు బస్సు లోయలో పడింది. సంఘటనస్థలానికి రెస్క్యూ సిబ్బంది చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఈ ప్రమాదానికి గల కారణాలపై అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాదానికి గల కారణాలపై అధికారులు ఆరా తీస్తున్నారు. క్షతగాత్రులను సమీపంలోని ఆసుపత్రికి తరలించారు.



## కార్తికమాసం తొలి సోమవారం..
# శివనామ స్మరణతో మారుమ్రోగుతున్న ఆలయాలు

కార్తికమాసం తొలి సోమవారం సందర్భంగా రాష్ట్రంలోని శైవక్షేత్రాలు భక్తులతో కిటకిటలాడుతున్నాయి. శివనామ స్మరణతో ఆలయాలు మారుమ్రోగుతున్నాయి. పుణ్యస్నానాల కోసం వచ్చిన భక్తులతో కృష్ణా, గోదావరి తీరాల్లో సందడి నెలకొంది. ప్రముఖ ఆలయాలకు భక్తులు భారీగా తరలివస్తుండటంతో రద్దీ నెలకొంది. రుద్రాభిషేకాలు, మహా రుద్రాభిషేకాలు, బిల్వార్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. కార్తిక దీపాలు వెలిగించి ఆ ముక్కంటి కృపాకటాక్షాలు తమపై ఎల్లవేళలా ఉండాలని కోరుకుంటున్నారు. రాష్ట్రంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయంలో భక్తుల రద్దీ నెలకొంది. స్వామి వారికి గోపూజ, మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం ఆలయ అర్చకులు నిర్వహించారు. కార్తిక మాసం మొదటి సోమవారం కావడంతో రెండుసార్లు సత్యనారాయణ వ్రతం నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు.

# మరోసారి రెచ్చిపోయిన ఖలిస్థానీలు
### కెనడాలో హిందూ ఆలయంపై దాడి

కెనడాలోని ఖలిస్థానీలు మరోసారి రెచ్చిపోయారు. ఈసారి వారు అక్కడి బ్రాంప్టన్‌లోని హిందూ ఆలయాన్ని లక్ష్యంగా చేసుకొని.. భక్తులపై దాడులు చేశారు. దీనిని ఆ దేశ ప్రధాని జస్టిన్ ట్రూడో తీవ్రంగా పరిగణించారు. అక్కడి ప్రజలు అన్ని మతాలను పాటించే హక్కును కాపాడతామని పేర్కొన్నారు. ఈ దాడులు ఏమాత్రం ఆమోదయోగ్యం కాదన్నారు. ఈనేపథ్యంలో బ్రాంప్టన్‌లోని ఆలయం వద్ద భారీగా భద్రతా దళాలను మోహరించారు. ఆలయ కాంప్లెక్స్‌లో కొందరు ఖలిస్థానీలు భక్తులపై దాడులు చేస్తున్న వీడియో వైరల్‌గా మారింది. దీనిపై పీల్ రీజనల్ పోలీస్ విభాగం ప్రతినిధి మాట్లాడుతూ తాము ఎవరినీ అరెస్టు చేయలేదన్నారు. ఘర్షణలకు కారణాలు చెప్పలేకపోయారు. ఈ దాడులపై




కెనడా ప్రతిపక్ష కన్జర్వేటివ్ పార్టీ నేత పియర్రె పొయిలీవ్రే స్పందిస్తూ.. ప్రతిఒక్కరికి వారి మతవిశ్వాసాలను పాటించే స్వేచ్ఛ ఉందన్నారు. తాను అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ గందరగోళ పరిస్థితులకు ముగింపు పలుకుతానని పేర్కొన్నారు. మరోవైపు కెనడా ఎంపీ చంద్ర ఆర్య స్పందిస్తూ కెనడాలో ఎంత తీవ్రస్థాయిలో హింసాత్మక తీవ్రవాదం పెరిగిపోయిందో ఈ ఘటన చెబుతోందన్నారు.

సూర్య
www.suryaa.com
EVENING EDITION 4PM

# రష్మిక అందానికి కుర్రాళ్లు ఫిదా

సౌత్ బ్యూటీ రష్మిక మందన ప్రస్తుతం పాన్ ఇండియా నటిగా మెరుస్తోంది. నేషనల్ క్రష్ దీపావళి పండుగను జరుపుకుంది. అభిమానులకు వెలుగుల పండుగ శుభాకాంక్షలు తెలియజేస్తోంది.సౌత్ బ్యూటీ రష్మిక మందన ప్రస్తుతం వరుస సినిమాలతో బిజీగా ఉంది. సినిమా షూటింగ్‌ల మధ్య విరామం తీసుకుని పండుగ జరుపుకుంది రష్మిక మందన. దీపావళి వేడుకల్ని జరుపుకున్న నటి ఫోటోను సోషల్ మీడియాలో షేర్ చేసింది.దీపావళి అంటే ఎవరికి ఇష్టం ఉండదు? దేశం మొత్తం దీపాల పండుగను ఎంతో ఉత్సాహంగా జరుపుకుంటుంది. నటీనటులు సోషల్ మీడియాలో ఫోటోలను షేర్ చేస్తూ అభిమానులకు శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు. ఎంత బిజీగా ఉన్నా సోషల్ మీడియాలో చాలా యాక్టివ్ గా ఉండే రష్మిక ఇప్పుడు పండగకు సంబంధించిన ఓ ఫోటోను షేర్ చేసింది.నటి రష్మిక మందన్న షేర్ చేసిన ఫోటోలకు విపరీతమైన లైక్స్ వస్తున్నాయి. కామెంట్స్ కూడా వెల్లువెత్తుతున్నాయి. కొడగులో రష్మిక దీపావళి జరుపుకుంటుందా అని అభిమానులు అడుగుతున్నారు. రష్మిక పండగకి అమ్మ ఇంటికి వచ్చిందా? లేదు,





# ఎగుమతుల్లో దూసుకుపోతున్న ఇండియా

పెట్రోలియం, జెమ్‌స్టోన్ (రత్నాలు), చక్కెర, ఆగ్రోకెమికల్ ఉత్పత్తుల ఎగుమతుల్లో భారత్ పాత్ర అంతర్జాతీయంగా బలోపేతం అవుతోంది. గడిచిన ఐదేళ్లుగా అంతర్జాతీయ వాణిజ్యంలో ఈ రంగాల నుంచి భారత్ ఎగుమతుల వాటా పెరుగుతున్నట్లు కేంద్ర వాణిజ్య శాఖ గణాంకాలు తెలియజేస్తున్నాయి. 2018 నుంచి 2023 మధ్య కాలంలో వీటితోపాటు ఎలక్ట్రికల్ గూడ్స్, న్యూమాటిక్ టైర్లు, ట్యాప్‌లు, వాల్వ్‌లు, సెమీకండక్టర్ పరికరాల ఎగుమతులు సైతం పెరుగుతున్నాయి.

వాణిజ్య శాఖ గణాంకాల ప్రకారం.. 2023లో పెట్రోలియం ఉత్పత్తుల ఎగుమతులు 85 బిలియన్ డాలర్ల(రూ.7.09 లక్షల కోట్లు)కు పెరిగాయి. ఈ రంగంలో అంతర్జాతీయంగా భారత్ వాటా 2018 నాటికి 6.45 శాతంగా ఉంటే, 2023 నాటికి 12.59 శాతానికి పెరిగింది. 2018లో పెట్రోలియం ఉత్పత్తుల పరంగా ఐదో అతిపెద్ద దేశంగా ఉండగా, 2023 నాటికి మూడో అతిపెద్ద ఎగుమతిదారుగా అవతరించింది.ప్రీషియస్, సెమీ ప్రీషియస్ (విలువైన రాళ్లు) స్టోన్స్ ఎగుమతుల పరంగా 2018 నాటికి భారత్ వాటా 16.27 శాతం కాగా, 2023 చివరికి 36.53 శాతానికి పెరిగింది. ఈ విభాగంలో అంతర్జాతీయంగా భారత్ నంబర్1 స్థానానికి చేరింది. 2023లో 1.52 బిలియన్ డాలర్ల విలువైన తర్నాలను భారత్ ఎగుమతి చేసింది. 2018లో ఎగుమతులు కేవలం 0.26 బిలియన్ డాలర్లుగానే (అంతర్జాతీయంగా రెండో స్థానం) ఉన్నాయి. చెరకు లేదా చక్కెర ఎగుమతుల పరంగా అంతర్జాతీయంగా భారత్ వాటా 2018 నాటికి ఉన్న 4.17 శాతం నుంచి 2023లో 12.21 శాతానికి చేరింది. చక్కెర ఎగుమతుల్లో భారత్ అంతర్జాతీయంగా రెండో అతిపెద్ద దేశంగా ఉంది ఆగ్రోకెమికల్, పురుగు మందులు ఆగ్రోకెమికల్, పురుగు మందుల ఉత్పత్తుల ఎగుమతులతో అంతర్జాతీయంగా భారత్ వాటా 8.52 శాతం నుంచి 10.85 శాతానికి పెరిగింది. 2023 చివరికి ఎగుమతులు 4.32 బిలియన్ డాలర్లకు వృద్ధి చెందాయి. అంతర్జాతీయ వ్యవసాయ, పర్యావరణ ప్రమాణాలకు అనుగుణంగా ఉత్పత్తులను తయారు చేసే సామర్థ్యాలు భారత్‌కు కలిసొస్తున్నాయి. ఈ విభాగంలో అంతర్జాతీయంగా భారత్ మూడో స్థానానికి ఎగబాకింది.

# రిటైర్మెంట్ ప్రకటించిన టీమిండియా వికెట్‌కీపర్



టీమిండియా వికెట్ కీపర్ వృద్ధిమాన్ సాహా ఆటకు వీడ్కోలు పలికాడు. అంతర్జాతీయ క్రికెట్‌తో సహా దేశవాళీ ఆటకు రిటైర్మెంట్ ప్రకటించాడు. ప్రస్తుతం జరుగుతున్న రంజీ ట్రోఫీ తన కెరీర్‌లో ఆఖరిదని తెలిపాడు. 2010లో భారత జట్టులోకి అరంగేట్రం చేసిన సాహా 2021 వరకు ప్రాతినిధ్యం వహించాడు. టెస్టులకు ఎంఎస్ ధోనీ రిటైర్మెంట్ ప్రకటించిన తర్వాత ఎంతో కాలం భారత తొలి ప్రాధాన్యత వికెట్ కీపర్‌గా బాధ్యతలు వహించాడు. రిషభ్ పంత్, కేఎస్ భరత్ రాకతో టెస్టుల్లో చోటు కోల్పోయాడు. 40 ఏళ్ల వృద్ధిమాన్ సాహా భారత్ తరఫున 40 టెస్టులు, 9 వన్డేలు ఆడాడు. సుదీర్ఘ ఫార్మాట్‌లో 29.41 సగటుతో 1353 పరుగులు చేశాడు. మూడు సెంచరీలు, ఆరు అర్ధశతకాలు బాదాడు. 2021లో వాంఖడే వేదికగా న్యూజిలాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో టీమిండియాకు ఆఖరిగా ప్రాతినిధ్యం వహించాడు."నా క్రికెట్ గొప్ప ప్రయాణంలో ఈ సీజన్ చివరిది. బెంగాల్ తరఫున చివరిసారిగా ప్రాతినిధ్యం వహించనుండటం గౌరవంగా ఉంది. ఈ రంజీ ట్రోఫీ అనంతరం వీడ్కోలు పలకున్నాను" అని సాహా పేర్కొన్నాడు. 2007 నుంచి 2022 వరకు బెంగాల్ సాహా ప్రాతినిధ్యం వహించాడు. ఆ తర్వాత రెండేళ్లు త్రిపుర తరఫున ఆడాడు. ఈ ఏడాది ఆగస్టులో బెంగాల్‌కు తిరిగొచ్చాడు.

**ఐపీఎల్‌కూ గుడ్‌బై!**

ఐపీఎల్‌కు కూడా వృద్ధిమాన్ సాహా గుడ్‌బై చెప్పినట్లు తెలుస్తోంది. మెగా వేలానికి సాహా రిజిస్టర్ చేసుకోవట్లేదని సమాచారం. గుజరాత్ టైటాన్స్ సాహాను రిటైన్ చేసుకోని విషయం తెలిసిందే. కాగా, ఐపీఎల్ ఆరంభం నుంచి ఆడుతున్న సాహా గుజరాత్‌తో పాటు సన్‌రైజర్స్ హైదరాబాద్, చెన్నై సూపర్ కింగ్స్, పంజాబ్ కింగ్స్ తరఫున ప్రాతినిధ్యం వహించాడు.



# ఓటమి బాధిస్తోంది..

స్వదేశంలో బెబ్బులిలా గర్జించే భారత జట్టుకు ఘోర పరాభవం. ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ 2023-25 ఫైనల్ ఆశలకు గండికొడుతూ న్యూజిలాండ్ 3-0తో సిరీస్‌ను తన్నుకుపోయింది. స్వల్ప ఛేదనలో విజయం మనదే అనే ధీమాతో ఉన్న అభిమానులకు షాకిస్తూ.. రోహిత్ సేన 25 పరుగుల తేడాతో ఓడి డబ్ల్యూటీసీ పట్టికలో అగ్రస్థానం చేజార్చుకుంది. సొంత మైదానం వాంఖడేలో దారుణ ఓటమిపై హిట్‌మ్యాన్ స్పందిస్తూ.. సిరీస్ కోల్పోవడం, టెస్టు మ్యాచ్ ఓడడం చాలా బాధగా ఉందని అన్నాడు. వాంఖడేలో ఈజీగా గెలవాల్సిన మ్యాచ్‌లో టీమిండియా టాపార్డర్ విఫలమైంది. రిషభ్ పంత్(64) ఒంటరి సైనికుడిలా పోరాడినా చివరిదాకా నిలిచి విజయాన్ని అందించలేకపోయాడు. అజాజ్ పటేల్(6/57) తిప్పేయగా న్యూజిలాండ్ చిరస్మరణీయ విజయంతో భారత జట్టును వైట్‌వాష్ చేసింది. ఊహించని పరాజయంపై రోహిత్ శర్మ ఏం అన్నాడంటే.. 'స్వదేశంలో టెస్టు సిరీస్ కోల్పోవడం జీర్ణించుకోలేని విషయం. మేము అత్యుత్తమ ఆట ఆడలేదు. సిరీస్ ఆసాంతం కివీస్ చాలా గొప్పగా ఆడింది. బెంగళూరు, పుణేలో మేము ఎక్కువ రన్స్ చేయలేదు. ఇప్పుడు వాంఖడేలోనూ 30 పరుగుల ఆధిక్యం సాధించామంతే.

**గంభీర్ ముందు కఠిన పరీక్ష**

గంభీర్ కోచ్‌గా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి భారత జట్టు ఆటతీరు ఆశించినంతగా లేదు. శ్రీలంక, న్యూజిలాండ్ చేతిలో సిరీస్‌లను కోల్పోయింది. దీంతో త్వరలో రానున్న టోర్నీలు గౌతీకి అగ్నిపరీక్షలే. జట్టు ఆటను మెరుగుపర్చడంతో పాటు భారత్‌ను విజయతీరాలకు చేర్చాల్సిన బాధ్యత ఆయనపై చాలా ఉంది. ఈ నెల 22 నుంచి పెర్త్ వేదికగా బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ ప్రారంభం కానుండటంతో ఆయన ఎలాంటి టెక్నిక్స్ అమలు చేస్తారనే ఆసక్తి నెలకొంది.



# మెట్రో రైలులో సాంకేతిక లోపం.. ప్రయాణికుల ఇబ్బందులు

మెట్రోరైలులో ఈరోజు ఉదయం సాంకేతిక లోపం ఏర్పడింది. కీలకమైన ఐటీ కారిడార్‌ను కనెక్ట్ చేసే నాగోల్-రాయదుర్గం లైన్‌తో పాటు రద్దీ ఎక్కువగా ఉండే మియాపూర్-ఎల్బీనగర్ రూట్‌లో సాంకేతిక సమస్య కారణంగా రైళ్లు నెమ్మదిగా నడుస్తున్నాయి. విద్యుత్ ఫీడర్‌లో సమస్య కారణంగా మెట్రో రైళ్లు నెమ్మదిగా నడుస్తున్నాయని ఎల్‌అండ్‌టీ అధికారులు చెబుతున్నారు. రైళ్ల ఆలస్యంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆఫీసు సమయం మించిపోతోందని ఉద్యోగులు ఆందోళనకు గురవుతున్నారు. కాగా, గతంలోనూ పలుమార్లు మెట్రో రైలుకు సాంకేతిక ఇబ్బందులు ఎదురై గంటలకొద్దీ నిలిచిపోయిన సందర్భాలున్నాయి. ఈ సందర్భాల్లోనూ ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు.

# స్టన్నింగ్ కాప్‌గా వరుణ్ ధవన్

వరుణ్ ధవన్ లీడ్ రోల్‌లో నటిస్తున్న ప్రాజెక్ట్ బేబీ జాన్. నేషనల్ అవార్డు విన్నింగ్ హీరోయిన్ కీర్తి సురేశ్ బాలీవుడ్ డెబ్యూ ప్రాజెక్ట్ కావడంతో అంచనాలు భారీగానే ఉన్నాయి. బాలీవుడ్ స్టార్ యాక్టర్ సల్మాన్ ఖాన్ కామియో రోల్‌లో కనిపించబోతున్నాడు. Kalees డైరెక్ట్ చేస్తున్న ఈ చిత్రాన్ని డిసెంబర్ 25న ప్రపంచవాప్తంగా క్రిస్మస్ కానుకగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల చేస్తున్నట్టు ఇప్పటికే ప్రకటించారు మేకర్స్.ఒకవేళ ఇది మొదలు అయితే.. రాబోయే భవిష్యత్‌ను ఊహించుకోండి.. అంటూ బేబిజాన్‌ను షేర్ చేసింది కీర్తి సురేశ్. బేబి (చిన్నారి)వాయిస్ ఓవర్‌తో షురూ అయిన ట్రైలర్.. వరుణ్ ధవన్ స్టన్నింగ్ కాప్‌గా స్టైలిష్ అవతార్‌లో యాక్షన్ సీక్వెన్స్‌లో అదరగొట్టేస్తున్నాడు. సినిమాలో కీర్తిసురేశ్ గ్లామరస్‌గా కనిపించబోతున్నట్టు తాజా వీడియో చెబుతోంది. బేబి చుట్టూ తిరిగే సస్పెన్స్, థ్రిల్లింగ్ కథాంశంతో సినిమా ఉండబోతున్నట్టు హింట్ ఇచ్చేసి బేబిజాన్‌పై క్యూరియాసిటీ అమాంతం పెంచేస్తున్నాడు డైరెక్టర్.ఈ చిత్రంలో వామికా గబ్బి మరో హీరోయిన్‌గా నటిస్తోంది. బేబిజాన్ నుంచి ఇప్పటికే షేర్ చేసిన ఫస్ట్ లుక్ ప్రేక్షకుల్లో క్యూరియాసిటీ పెంచుతోంది. ఈ చిత్రానికి థమన్ సంగీతం అందిస్తుండగా.. సినీ 1 స్టూడియోస్, జియో స్టూడియోస్‌తో కలిసి ప్రియా అట్లీ సంయుక్తంగా తెరకెక్కిస్తున్నారు.

